సాక్షి
కుమురం భీం

బుధవారం, 7, ఫిబ్రవరి, 2024



ఇంకెంత కాలం? 8లో▸

టీచర్ పోస్టుల భర్తీ కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. నోటిఫికేషన్ విడుదల చేయాలని బుధవారం విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు.



ముగిసిన జాతర

కెరమెరి మండలం ఇందాపూర్ సమీపంలో నిర్వహిస్తున్న పోతురాజు, ధర్మరాజు జాతర ఉత్సవాలు ముగిశాయి. భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /21.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నిబంధనల ప్రకారం పత్తి కొనుగోళ్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నిబంధనల ప్రకారం పత్తి కొనుగోళ్లు చేపడతామని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్‌తో కలిసి అధికారులు, సీసీఐ ప్రతినిధులు, మిల్లుల యజమానులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి ఈ నెల 9 వరకు సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు యథావిధిగా సాగుతాయన్నారు. జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు అధికంగా ఉన్నందున ఈ నెల 12 నుంచి 15 వరకు కొనుగోళ్లు ఉంటాయని, శుక్ర, శని, ఆదివారాలు సెలవులుగా నిర్ణయించినట్లు తెలిపారు. మూడో విడత పత్తి ఏరుతున్న నేపథ్యంలో రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందే నాణ్యత చూసుకోవాలన్నారు. సెలవులను గమనిస్తూ విడతల వారీగా కేంద్రాలకు రావాలని సూచించారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: గర్భిణుల వివరాలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పకడ్బందీగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం డీఎంహెచ్‌వో తుకారాంతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గర్భిణి తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తమ పరిధిలోని గర్భిణుల వివరాలు సేకరించి విధిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తూ, రక్తహీనతతో బాధపడే వారికి పోషకాహారం అందించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీల వారీగా గర్భిణుల వివరాలను పరిశీలించారు.

అందుబాటులోకి ‘లహరి’ సర్వీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: దూరప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం ఆసిఫాబాద్ డిపో పరిధిలో రెండు లహరి(ఏసీ/స్లీపర్ కోచ్) బస్సులు సర్వీసులు అందుబాటులోకి తెచ్చినట్లు డీఎం శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ డిపో నుంచి ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలు, రాత్రి 9.15 గంటలకు బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్ ఉదయం 9 గంటలు, రాత్రి 8.30 గంటలకు బస్సులు ప్రారంభమవుతాయన్నారు. జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు సీటర్‌కు చార్జీ రూ.850, స్లీపర్‌కు రూ.1180 నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం బయలుదేరే బస్సు నేరుగా హైదరాబాద్‌కు వెళ్తుందని, అదేవిధంగా రాత్రి బయలుదేరే బస్సు వయా కాగజ్‌నగర్ మీదుగా వెళ్తుందని పేర్కొన్నారు. www. tsrtconline.in ద్వారా సీటు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. అలాగే టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్(కార్గో) కార్యాలయం మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. కార్గో ఏజెంట్‌ను 79725 17549 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తుంగెడ కార్యదర్శిపై ఫిర్యాదు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం తుంగెడ పంచాయతీ కార్యదర్శి రాధికపై మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తాజా మాజీ ఉప సర్పంచ్ సాయికృష్ణ తెలిపారు. ఈ నెల 31న ఉప సర్పంచ్‌గా ఉన్న తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, సంతకం లేకుండానే జీపీ నిధుల నుంచి రూ.35వేలు కార్యదర్శి తీసుకున్నారని ఆరోపించారు. గతంలో పంచాయతీ కార్యాలయానికి విద్యుత్ మీటర్ కోసం రూ.4వేలు తీసుకుని ఇప్పటి వరకు బిగించలేదన్నారు. ఆ నగదును కార్యదర్శి సొంతానికి వాడుకున్నట్లు ఆరోపించారు. విచారణ చేపట్టిన తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మార్కెట్ దూరం.. రవాణా భారం



వీరంతా కౌటాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన రైతులు.. మిర్చి పంట చేతికందడంతో అమ్ముకునేందుకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్లారు. పంటను ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి మార్కెట్‌కు తరలించారు. దీంతో లాభాల్లో చాలా వరకు రవాణా ఖర్చుకే వెచ్చించాల్సి వస్తోంది. రెండు, మూడు రోజులు అక్కడే నిరీక్షిస్తేగానీ పంటను అమ్ముకోవడం సాధ్యం కావడం లేదు.



కౌటాల మండలం తాటిపల్లికి చెందిన ఎల్ములె దత్తు ఐదెకరాల్లో మిర్చి పంట సాగు చేశాడు. ఇప్పటివరకు ఎకరానికి రూ.1.20లక్షల వరకు ఖర్చయింది. ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. పంటను అమ్ముకునేందుకు స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో వరంగల్, నాగ్‌పూర్‌కు వెళ్లాల్సిందేనని చెబుతున్నాడు. నాగపూర్‌కు వెళ్లేందుకు క్వింటాలుకు రూ.2500 చెల్లించడంతోపాటు మూడు, నాలుగు రోజులు పైగా సమయం వెచ్చించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

- ‘మిర్చి’ రైతులకు మార్కెటింగ్ కష్టాలు
- పంటను అమ్ముకోవడానికి నాగ్‌పూర్, వరంగల్ వెళ్లాల్సిందే..
- అన్నదాతలపై అదనంగా రవాణా ఖర్చుల భారం
- జిల్లాలో మార్కెట్ యార్డు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్

చింతలమానెపల్లి(సిర్పూర్): మిర్చి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువవుతోంది. జిల్లాలో 3.40లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇక్కడ ప్రధానంగా పత్తి, వరి పంటలు సాగు చేస్తున్నారు. అయితే పత్తిలో వరుసగా నష్టాలు వస్తుండటంతో కొంతమంది ధైర్యం చేసి మిర్చి సాగు వైపు దృష్టి సారించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి చూపిన రైతులకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మిర్చి సాగు ఆశాజనకంగా కనిపించింది. గడిచిన ఐదేళ్లలో జిల్లా వ్యాప్తంగా మిర్చి సాగు గణనీయంగా పెరిగిందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. అయితే పంట దిగుబడులు ఉన్నా స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.



కౌటాలలో ఆరబెట్టిన మిర్చి

వేగంగా విస్తరణ

గతంలో కొన్ని గ్రామాలకు మాత్రమే పరిమితమైన మిర్చి సాగు ఈ ఏడాది అన్ని మండలాలకు విస్తరించింది. గతేడాది జిల్లావ్యాప్తంగా 700 ఎకరాల్లో సాగు చేయగా ప్రస్తుతం 1900 ఎకరాల్లో పంట వేశారు. కౌటాల మండలం తాటిపల్లి రైతులు గతేడాది అత్యధికంగా మిర్చి సాగు చేసి లాభాలు పొందారు. అలాగే సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లో ప్రస్తుతం మిర్చి సాగు ఎక్కువగా ఉండగా, వచ్చే ఏడాది మరింత పెరిగే అవకాశం ఉంది.

అమ్మకం ఎలా..

ఎకరాకు సుమారుగా 22 నుంచి 26 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేసినా సుమారుగా జిల్లాలో 50వేల క్వింటాళ్ల మిర్చి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. పంట నిల్వ చేసేందుకు జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు లేవు. మార్కెట్ యార్డు కూడా అందుబాటులో లేక దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి. ఈ క్రమంలో గ్రామీణ రైతులు మోసపోయే ప్రమాదం ఉంది. ఓ వైపు పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండగా.. రైతులు పంటను వరంగల్, కరీంనగర్, నాగ్‌పూర్, ఇంగన్‌ఘాట్ మార్కెట్ యార్డులకు తరలిస్తున్నారు. రైతులు క్వింటాలుకు అదనంగా రవాణా చార్జీలు, హమాలీ, ఇతర ఖర్చుల రూపంలో రూ.2500 వరకు భరించాల్సి వస్తోంది. జిల్లా నుంచి రైతులు ఎక్కువగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్తుండగా.. తిరిగి రావడానికి సుమారుగా నాలుగు రోజుల సమయం పడుతోంది. సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. స్థానికంగా మార్కెట్‌యార్డు, మిర్చిను నిల్వ ఉంచుకునేలా గోదాంలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అప్పటివరకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు.

వ్యాపారులకు అమ్ముకున్నాం



మిర్చి పంటను అమ్ముకునేందుకు మార్కెటింగ్ సౌకర్యం లేదు. కొన్నేళ్లుగా చింతలమానెపల్లి మండలంలో మిర్చి సాగు చేస్తున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో కాగజ్‌నగర్‌లోని వ్యాపారులకు పంట అమ్ముకున్నాం. మార్కెట్ యార్డు ఉంటే ఉపయోగపడుతుంది.

– బల్దారపు రాజన్న, చింతలమానెపల్లి

మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి



జిల్లాలో మిర్చి కొనుగోలుకు మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి. యార్డు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర లభిస్తే లాభాలు వస్తాయి. మిర్చి సాగుకు ఇది ప్రోత్సాహంగా ఉంటుంది. రైతులకు కష్టాలు తప్పుతాయి.

– చెమ్మకారి గంగన్న, లగ్గాం, మం.దహెగాం

కొనుగోలు కేంద్రాల ఏర్పాటును పరిశీలిస్తాం

జిల్లాలో మిర్చి సాగు పెరుగుతున్న విషయం పరిగణలోకి వచ్చింది. క్రాప్ బుకింగ్ ద్వారా వివరాలు సేకరిస్తున్నాం. స్వయం సహాయక సంఘాలు లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మిర్చి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటును పరిశీలిస్తాం. అధికారుల నుంచి నివేదిక తీసుకుని చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: ఓటరు జాబితా సవరణ కార్యక్రమం- 2024లో భాగంగా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్- 2024లో భాగంగా నూతన ఓటరు నమోదు కోసం రెండు నియోజకవర్గాల నుంచి 9,238 దరఖాస్తులు రాగా, 8,829 మందిని అర్హులుగా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. జాబితాలో పేర్ల తొలగింపు కోసం ఫారం- 7 ద్వారా 7,551 దరఖాస్తులు రాగా 7,424 దరఖాస్తులకు సంబంధించి నోటీసులు జారీ చేసి తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 123 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. పేర్లు, చిరునామా సవరణల కోసం 4,496 దరఖాస్తులు రాగా 4,279 పరిష్కరించి మరో 217 తిరస్కరించామని తెలిపారు. సహాయక కేంద్రాలతో కలిపి జిల్లా వ్యాప్తంగా 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాలను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో రూర్బన్ పథకంలో భాగంగా చేపట్టిన జిల్లా కేంద్ర గ్రంథాలయం భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా గ్రంథాలయం నిర్మాణ పనులను మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. వివిధ రకాల పత్రికలు, పుస్తకాలు, ఫర్నీచర్ సమకూర్చాలని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్‌డీవో సురేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత తదితరులు ఉన్నారు.

సుమన్.. నోరు అదుపులో ఉంచుకో

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు



మాట్లాడుతున్న విశ్వప్రసాద్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నేత, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నోరు అదుపులో ఉంచుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌తో కలిసి మాట్లాడారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడితే బాల్క సుమన్‌ను తెలంగాణలో తిరగనివ్వమని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి బయటపడుతుందనే భయంతో ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇసుక, భూమి, మైనింగ్ తదితర వాటిల్లో విచ్చలవిడిగా అక్రమాలు జరిగాయని, త్వరలో అన్ని బయటకు వస్తాయని తెలిపారు. అనంతరం శ్యాంనాయక్ మాట్లాడుతూ బాల్క సుమన్ సీఎంపై చేసిన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించి ప్రభుత్వానికి అభివృద్ధిలో సహకరించాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు కాశయ్య, జక్కయ్య, వసంత్, గుండా శ్యాం, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు



రీడింగ్ పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేపట్టారు. మంచిర్యాల విజిలెన్స్ ఏడీఈ రాజేశం ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లి, వల్లకొండ, బెజ్జూర్ మండలంలోని మర్తిడి, రెబ్బెన గ్రామాల్లో రైస్‌మిల్లుల విద్యుత్ మీటర్లను పరిశీలించారు. బెజ్జూర్ మండలం మర్తిడి గ్రామంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 11 మందిపై కేసు నమోదు చేశారు. మోటార్ల కోసం తీగలకు కొండీలు వేసిన నలుగురు, బిల్లు కట్టకుండా విద్యుత్ వినియోగించుకుంటున్న ముగ్గురు, మీటర్ లేకున్నా విద్యుత్ వినియోగించిన మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఏడీఈ రాజేశం తెలిపారు. ఆయన వెంట ఏఈలు శ్యాంసుందర్, రాజేశ్ ఉన్నారు.

వినికిడి లోపం ఉన్న వారికి ఉపకరణాలు




మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: వినికిడి లోపం ఉన్న వారికి వుయి ఇన్నోవేషన్ సంస్థ అందిస్తున్న ఉపకరణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం వుయి ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత క్యాంపు నిర్వహించారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకరణాలు అందించేందుకు వివరాలు నమోదు చేసుకున్నారు. డీఈవో మాట్లాడుతూ పరీక్షల అనంతరం వినికిడి లోపం ఉన్న పిల్లలకు అవసరమైన ఉపకరణాలు అందిస్తారని తెలిపారు. అర్హులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎస్‌వో అబిద్ అలీ, హెచ్‌ఎం సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

‘గిరి’ బడులకు సార్లు డుమ్మా!

- గిరిజన పాఠశాలలపై ఐటీడీఏ ఉపాధ్యాయుల చిన్నచూపు
- నెలల తరబడి స్కూళ్ల వైపు తిరిగి చూడని వైనం
- ప్రైవేటు వ్యక్తులతో బోధన కొనసాగింపు



ఎనోలి కొలాంగూడ పాఠశాల సమీపంలో ఆడుకుంటున్న చిన్నారులు(ఫైల్)



ఇది వాంకిడి మండలం ఖిరిడి పంచాయతీ పరిధిలోని లింబుగూడ టీడబ్ల్యూపీఎస్(ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ స్కూల్). గత నెల 30(మంగళవారం)న పాఠశాలను సందర్శించగా ఇలా వంట సామగ్రి కనిపించింది. ఐటీడీఏ పీవీటీజీలకు నివాస గృహాలు నిర్మించేందుకు వచ్చిన మేస్త్రీలు, కూలీలు బడిలోనే వంట చేసుకుంటున్నారు. ఉపాధ్యాయుడు మాత్రం అప్పుడప్పుడు వస్తున్నారని, స్థానికంగా ఓ యువకుడు ప్రైవేట్ బడిలో పాఠాలు బోధిస్తున్నాడని తెలిసింది. ఈ మంగళవారం కూడా పాఠశాలకు ‘సాక్షి’వెళ్లగా తాళం వేసి దర్శనమిచ్చింది. ఇదే విషయంపై డీడీవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. 20 రోజుల క్రితం టీచర్‌కు యాక్సిడెంట్ అయ్యిందని, అప్పటి నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నట్లు తెలిపారు. కొరత ఉండటంతో మరో టీచర్‌ను కేటాయించలేదని స్పష్టం చేశారు.



ఇది వాంకిడి మండలం పాటగూడ పంచాయతీ పరిధిలోని ఎనోలి కొలాంగూడ ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ స్కూల్. ఈ పాఠశాల కొన్నేళ్లుగా మూతబడి ఉండగా గ్రామంలోని చిన్నారులు చదువుకు దూరమవుతున్నారని గ్రామస్తులందరూ కలిసి బడిని తెరిపించారు. మూడు నెలల క్రితం స్కూల్ తెరుచుకోగా అప్పటి నుంచి ఓ ఉపాధ్యాయుడు అప్పుడప్పుడు మాత్రమే వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ టీచర్ కూడా అనారోగ్య సమస్యలతో గ్రామంలో ఓ వ్యక్తిని సొంత ఖర్చులతో నియమించుకున్నట్లు సమాచారం. ఆ ప్రైవేట్ వ్యక్తే సమయం ఉన్నప్పుడు బడిలో పిల్లలను కూర్చొబెట్టి అ,ఆలు దిద్దిస్తున్నారు. ఉపాధ్యాయుడు అనారోగ్యంతో ఉన్నారని, వారానికి ఒకసారి పాఠశాలకు వచ్చి వెళ్తున్నారని డీడీవో శ్రీనివాస్ తెలిపారు.

వాంకిడి(ఆసిఫాబాద్): జిల్లాలో ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గిరిజన పాఠశాలల నిర్వహణ గాడి తప్పుతోంది. అనారోగ్య కారణాలను సాకు చూపి టీచర్లు బడులకు డుమ్మా కొడుతున్నారు. విధులకు హాజరు కాకున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. బడికి రాకున్నా వేతనాలు మాత్రం పూర్తిస్థాయిలో తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కారణాలు ఏవైనా ఆదివాసీ చిన్నారులు మాత్రం చదువుకు దూరమవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తం 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో కొన్ని గిరిజన గ్రామాలకు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం బడీడు పిల్లలు చదువుకు దూరం కాకుడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఆయా గిరిజన పల్లెల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఏకోపాధ్యాయ పాఠశాలలు 331 ఉండగా.. ఇందులో 4034 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ ఉన్నతాధికారుల అలసత్వంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇటీవల వాంకిడి మండలంలోని లింబుగూడ, ఎనోలి కొలాంగూడ పాఠశాలలను ‘సాక్షి’ పలుమార్లు సందర్శించగా బడికి అసలు ఉపాధ్యాయులే హాజరు కాలేదు. దీనిపై గ్రామస్తుల వద్ద ఆరా తీయగా సారు ఎప్పుడు వస్తారో తెలియదని పలువురు సమాధానం ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఇదే పరిస్థితి ఉంది. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు ఏదైనా కారణంతో సెలవుల్లో ఉంటే విద్యార్థులు నష్టపోకుండా వేరే టీచర్‌ను సదరు పాఠశాలకు కేటాయించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో పరిస్థితి భిన్నంగా ఉంది. విధులకు హాజరు కాని ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో ఆయా గ్రామాలకు చెందిన యువకులను నియమించుకుంటున్నారు. విధులకు డుమ్మా కొడుతూ వారితో బోధన సాగిస్తున్నారు. పాఠశాల రికార్డుల పరంగా మాత్రం సదరు ఉపాధ్యాయుడు హాజరైనట్లే నమోదై ఉంటుంది. ఈ విషయం తెలిసినా.. కొంత మంది ఐటీడీఏ అధికారులు సైతం దీనికి సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే మారుమూల గిరిజన గ్రామాల్లో ఈ తతంగం కొనసాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ఐటీడీఏ ఏసీఎంవో ఉద్ధవ్‌ను ఫోన్‌లో వివరణ కోరగా గిరిజన పాఠశాలలను నిత్యం పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.